నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, మంగళవారం 2 జూలై 2024 | SIDDIPET

చిన్నకోడూరు జడ్పీ చైర్ పర్సన్ రోజా శర్మ దంపతులను సన్మానిస్తున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

చిన్నకోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న మాజీమంత్రి, హరీశ్‌రావు

గ్రామాల్లో పాలన అస్తవ్యస్తం

- కార్యదర్శులు సొంత డబ్బులు వెచ్చిస్తే తప్పా పాలన సాగని పరిస్థితి
- ఏడు నెలలైనా పారిశుధ్య కార్మికులకు జీతాల్లేవు
- బ్లీచింగ్ పౌడర్ కొనాలన్నా..జీపీలో పైసలు సున్నా
- ఎరువుల సరఫరాలో రైతులకు ఇబ్బందులు రావద్దు
- చిన్నకోడూరు మండల పరిషత్ సమావేశంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు

చిన్నకోడూరు మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

చిన్నకోడూరు, జూలై 1: గ్రామాల్లో పాలన అస్తవ్యస్తంగా సాగుతోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఏడు నెలల నుంచి పంచాయతీ కార్మికులకు, మధ్యాహ్న భోజనం వండే కార్మికులకు జీతాల్లేవన్నారు. పంచాయతీ కార్యదర్శులు సొంత డబ్బులు ఖర్చు పెడితేనే గ్రామాల్లో కార్మికుల జీతాలు, ట్రాక్టర్ డీజిల్, వీధి దీపాలు వెలిగే దయనీయ పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. సోమవారం చిన్నకోడూరు మండల పరిషత్ కార్యాలయంలో వైస్ఎంపీపీ కీసరి పాపయ్య అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశానికి హరీశ్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామా ల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైందన్నారు. గ్రామ అభివృద్ధి కోసం పంచాయతీ కార్యదర్శులు సొంత డబ్బులు వెచ్చిస్తే తప్పా పాలన ముందుకు కొనసాగే పరిస్థితి లేదన్నారు. పంచాయతీ కార్మికులకు ఏడు నెలల నుంచి జీతాలు ఇవ్వకుంటే వాళ్ల కుటుంబం రోడ్డున పడే పరిస్థితి ఉందన్నారు. గ్రామ పంచాయతీల్లో కరెంట్ బిల్లులు వేలల్లో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రతినెలా గ్రామ పంచాయతీకి నిధులు విడుదల కావడం లేదన్నారు. పంచాయతీ కార్యదర్శులకు వచ్చే జీతాలకు అదనంగా ఖర్చులు పెడుతున్నట్లు హరీశ్‌రావు తెలిపారు. వర్షాకాలంలో పారిశుధ్యం లోపించకుండా ఉండాలంటే బ్లీచింగ్ తదితర వస్తువులు కొనుగోలు చేయాలంటే డబ్బులు లేని పరిస్థితి ఉందన్నారు. నెల రోజుల నుంచి గ్రామాల్లో పారిశుధ్యం కుంటుపడిందన్నారు. వృద్ధులకు రెండు నెలల పెన్షన్, మధ్యాహ్న భోజన కార్మికులకు ఏడు నెలల నుంచి జీతాలు బంద్ చేశారని చెప్పారు.

ఎరువుల సరఫరాలో ఇబ్బందులు రావద్దు

వానకాలంలో రైతులకు ఎరువుల సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు అధికారులకు సూచించారు. కాంప్లెక్స్ ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామని లింకు పెట్టి రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతుబంధు సాగుకు ముందే రైతుల ఖాతాలో జమయ్యేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతు భరోసా ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేయాలని సాధారణ సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు చెప్పారు. పచ్చిరొట్ట విత్తనాలు దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. వరి నాట్లు వేసే టైంకు విత్తనాలు వస్తే ఎలా అని అధికారులను ప్రశ్నించారు. విత్తనాలు దొరక్క రైతులు బ్లాక్ మార్కెట్‌లో ఎక్కువ ధరకు కొనుగోలు చేసి తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ప్రతి ఊరికి రెండు యూరియా లారీలు పంపించాలన్నారు. పదేండ్లు రైతులకు ఎరువులు ఏ విధంగా సరఫరా చేశామో.. అదేవిధంగా అందించాలన్నారు. ఆయిల్‌పామ్ సాగు పెరిగే విధంగా చర్యలు చేపట్టాలి. కాళేశ్వరం నీళ్లు వస్తాయా రావా అనే సందిగ్ధంలో రైతులు భయంతో వరి నాట్లు వేయడంలో వెనుక ముందు అవుతున్నారని తెలిపారు. గొర్రెల పంపిణీ పథకానికి డీడీలు కట్టిన రైతులకు వెంటనే గొర్రెలను పంపిణీ చేయాలని సమావేశంలో తీర్మానం చేసినట్లు తెలిపారు. అడవి జంతువుల దాడిలో మరణించిన గొర్రెలకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సీసీ రోడ్లు, కమ్యూనిటీ భవనాలతోపాటు పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలన్నారు. రాష్ట్రం, జిల్లాలో ఆదర్శంగా నిలిచిన ఉపాధ్యాయ బృందానికి మండల సభ అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. 10 జీపీఏ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్నట్లు తెలిపారు. 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు సొంత ఖర్చులతో త్వరలో ఐప్యాడ్ అందించి సన్మానిస్తామని హరీశ్‌రావు అన్నారు. అనంతరం ఐదేండ్లు పూర్తి చేసుకున్న ఎంపీటీసీలను ఎమ్మెల్యే హరీశ్‌రావు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గంగాపూర్ సొసైటీ చైర్మన్ కనకరాజు, అల్లిపూర్ సొసైటీ చైర్మన్ సదానందం గౌడ్, ఎంపీడీవో, పీవోపీఆర్డీ, వివిధ శాఖల అధికారులు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాసేవకు.. పదవి విరమణ ఉండదు..

ప్రజాసేవకు పదవి విరమణ ఉండదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఐదేండ్లలో కాళేశ్వరంతో గ్రామాల్లోని చెరువులు నింపి రెండు పంటలకు నీళ్లు అందించామన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు సమన్వయంతో ఎన్నో మంచి పనులు చేశారని గుర్తు చేశారు. ప్రజల జీవనాధారాన్ని, పల్లెల ముఖచిత్రాన్ని మార్చేది సాగునీరేనన్నారు. మనఊరు మనబడితో పాఠశాలలు బాగుపడ్డాయని, సీసీ రోడ్డు వందశాతం పూర్తి చేశామన్నారు. అన్ని గ్రామాలను, ఆలయాలను అభివృద్ధి చేశామన్నారు. మళ్లీ మీరందరూ గెలువాలని, భవిష్యత్తులో మీకు పెద్ద పదవులు రావాలని, మీ కష్టం వృథా కావద్దన్నారు. మీ అందరికీ వ్యక్తిగతంగా, రాజకీయంగా నా సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. పదవి ఎవరికీ శాశ్వతం కాదు, జీవితంలో తృప్తి అనేది ఉంటుందన్నారు. మనం చేసిన మంచి పనులు, మనం తెచ్చుకున్న పేరు ఎప్పటికీ నిలబడుతుందని, మనందరం కలిసి పని చేద్దామన్నారు. మీరు ఎంత బలంగా ఉంటే అంత బలంగా ఎదిగే అవకాశం ఉంటుందని, ఇంకా మంచి పేరు తెచ్చుకొని ముందుకు సాగాలని హరీశ్‌రావు సర్పంచులు, ఎంపీటీసీలకు సూచించారు.

ప్రజల మేలు కోసం పని చేస్తాం

ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల మేలు కోసం పని చేస్తామని, మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు సహకారంతో చిన్నకోడూరు మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామని జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజా శర్మ అన్నారు. సిద్దిపేట జిల్లాకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చామన్నారు. జిల్లాలోని అన్ని మండలాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల మేలు కోసం పని చేస్తామని, ప్రజలకు అందుబాటులో ఉండి, కష్టసుఖాల్లో పాలుపంచుకుంటామన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ఉచిత పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి
- మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- చిన్నకోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలన

చిన్నకోడూరు, జూలై 1 : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు వైద్యులకు సూచించారు. సోమవారం చిన్నకోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని హరీశ్‌రావు సందర్శించారు. దవాఖానలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఓపీ, ఏఎన్సీ చెకప్‌లు, ఫార్మసీలో అందుబాటులో ఉన్న మందులు, డయాగ్నోస్టిక్‌లో అందుతున్న సేవలను పరిశీలించారు. వానకాలం ప్రారంభమైన నేపథ్యంలో డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున అవసరమైన మందులు, ల్యాబ్ పరికరాలు ఉండేలా చూడాలన్నారు. డెంగీ, మలేరియా కేసులు ఎన్ని వస్తున్నాయి. ఎలాంటి చికిత్స అందిస్తున్నారనే విషయాలను డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఏఎన్ఎం, సిబ్బందితో సుదీర్ఘంగా హరీశ్‌రావు చర్చించారు. ఉచిత పరీక్షలు నిర్వహించే డయాగ్నోస్టిక్ సెంటర్ల సేవలు పేషెంట్లకు అందించాలని, వీలైనంత తర్వగా రిపోర్టులు తెప్పిం చి తగు వైద్యం అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు సరిత, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కాముని శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఉమేశ్‌చంద్ర, సిబ్బంది ఉన్నారు.

తక్షణమే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో నిరసన తెలుపుతున్న నిరుద్యోగులు

సిద్దిపేట అర్బన్, జూలై 1: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం 2 లక్షల ఉద్యోగాలకు సంబంధించి జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిరుద్యోగులు డిమాండ్ చేశారు. నిరుద్యోగుల సమస్యపై ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న నిరుద్యోగ జేఏసీ నాయకుడు మోతీలాల్ నాయక్‌కు మద్దతుగా సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిరుద్యోగులు నిరసన తెలిపారు. వీ వాంట్ జస్టిస్, గ్రూప్స్ పోస్టులు పెంచాలని, డీఎస్సీని వాయిదా వేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో డీఎస్సీ రాసే అభ్యర్థులు ఎక్కువగా ఉన్నారని, చదువుకునేందుకు కనీసం 3 నెలల సమయం ఇవ్వాలన్నారు. 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలన్నారు. గ్రూప్-2లో 2వేలు, గ్రూప్-3లో 3 వేలు ఉద్యోగాలు కలుపాలన్నారు. తమ డిమాండ్లు పరిష్కరించని పక్షం లో పెద్ద ఎత్తున ఉద్యమాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

'పల్లా' అరెస్టుకు నిరసనగా ఆందోళన

- చేర్యాలలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టిన బీఆర్ఎస్ శ్రేణులు
- సీఎం రేవంత్ దిష్టిబొమ్మ దహనం
- భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్

సిద్దిపేట జిల్లా చేర్యాలలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చేర్యాల, జూలై 1: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని హైదరాబాద్‌లో పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం చేర్యాలలో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేపట్టారు. పట్టణంలోని జనగామ-సిద్దిపేట జాతీయ రహదారిపై గంటపాటు రాస్తారోకో నిర్వహించడంతోపాటు సీఎం రేవంతర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. జాతీయ రహదారిపై గులాబీ శ్రేణులు రాస్తారోకో నిర్వహించడంతో సిద్దిపేట, జనగామ, నాగపూర్ రహదారుల్లో రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు రాస్తారోకో చేస్తున్న ప్రదేశానికి వచ్చి బీఆర్ఎస్ నాయకులను బలవంతంగా లాక్కెల్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ నిరుద్యోగులను కాంగ్రెస్ సర్కారు మోసం చేసిందని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోవడంతోపాటు ఉద్యోగాలు భర్తీ చేయాలని ఆమరణ దీక్ష చేస్తున్న నిరుద్యోగులను పరామర్శించేందుకు వెళ్లిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కారు అన్నివర్గాలనూ మోసం చేసిందన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌లో గెల్చిన ఎమ్మెల్యేను కాంగ్రెస్‌లో చేర్చుకుంటూ రాజకీయ వ్యభిచారాన్ని చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి రానున్న రోజుల్లో బుద్ధి చెబుతామన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు వెంటనే తన పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళన కార్యక్రమంలో కొమురవెల్లి జడ్పీటీసీ సిలువేరు సిద్దప్ప, చేర్యాల పట్టణ, మండల, మద్దూరు, కొమురవెల్లి మండల పార్టీ అధ్యక్షులు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, అనంతుల మల్లేశం, మేక సంతోశ్, గీస భిక్షపతి, మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణీశ్రీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి, ఏఎంసీ చైర్మన్ సుంకరి మల్లేశం, వైస్ చైర్మన్లు పుర్మ వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ తాండ్ర నవీన్‌రెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు, నాయకులు ముస్త్యాల బాల్‌నర్సయ్య, ముస్త్యాల కిషన్, పెడుతల ఎల్లారెడ్డి, శివగారి అంజయ్య, తాడెం రంజితాకృష్ణమూర్తి, పచ్చిమడ్ల మానస, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు గూడురు బాలరాజుతోపాటు నాలుగు మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

రాయపోల్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

రాయపోల్, జూలై 1 : కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడంతో పేద విద్యార్థులు ఉన్నతమైన స్థానాలు అధిరోహిస్తున్నారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం రాయపోల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అమ్మన భాస్కర్ రెడ్డి ఉద్యోగ విరమణలో పాల్గొని మాట్లాడారుప. గతంలో ఎన్నడూ లేనివిధంగా నేడు ప్రభుత్వ పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధిస్తున్నట్లు గుర్తు చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామన్నారు. ఇటీవల పదోతరగతి పరీక్షల్లో మండల వ్యాప్తంగా వందశాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చది వి పాఠశాలలకు, తల్లిదండ్రులకు, గ్రామాలకు మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. రాయపోల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ రెడ్డి విద్యార్థులకు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమలు ఎంతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి, జడ్పీటీసీ యాదగిరి, ఎంపీపీ కల్లూరి అనితా శ్రీనివాస్, ప్రజాయిత ఫౌండేషన్ చైర్మన్ మామిడి మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మనోహర్‌రావు, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రవీందర్ రెడ్డి, తెలంగాణ అమరవీరుల స్మారక రూప శిల్పి రమణారెడ్డి, తహసీల్దార్ దవ్య, ఎంపీడీవో బాలయ్య, ఎంఎన్‌వో సత్యనాయణరెడ్డి, అమ్మ అదర్శ కమిటీ చైర్‌పర్సన్ లావణ్య, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశ్వర శర్మ, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్ శర్మ, టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు తిరుపతిరెడ్డి, కొండల్‌రెడ్డి, రాంచంద్రం, కనుక య్య, వివిధ గ్రామల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దడంలోనే సంతృప్తి

తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి

గజ్వేల్‌లో పదవీ విరమణ సభలో మాట్లాడుతున్న నందిని సిధారెడ్డి

గజ్వేల్, జూలై 1: విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దడంలో ఎంతో సంతృప్తి కలుగుతుందని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నం దిని సిధారెడ్డి అన్నారు. సోమవారం గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి ఉద్యోగ విరమణలో పాల్గొని ఆయ న సేవలను కొనియాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కరీంనగర్ బిడ్డగా సిద్దిపేట డిగ్రీ కళాశాలలో చదువుకొని అదే కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. గజ్వేల్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తూ ఎంతోమంది విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దడంలో ఆయన చూపిన ప్రత్యేక శ్రద్ధ ఎంతో గొప్పదన్నారు. మనం పనిచేసే వృత్తిని న్యాయం చేసినప్పుడే మనకు ఎంతో ప్రశాంతత లభిస్తుందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యపై నమ్మకం కలిగేలా ప్రతి విద్యార్థిని ప్రతిభావంతుడిగా మార్చాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణపతిరావు, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, జిల్లా ఐడెంటిఫైడ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఉమాశశి, రిటైర్డు ప్రిన్సిపాల్ పాపయ్య, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణికి 68 అర్జీలు ■ కలెక్టర్ వల్లూరు క్రాంతి

అర్జీలు స్వీకరిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 1 : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 68 మంది దరఖాస్తు చేసుకున్నారని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూకు సంబంధించినవి 46, డీఆర్‌డీవో 11, ఇతర శాఖలకు సంబంధించినవి 11 ప్రజావాణి దరఖాస్తులు అందాయని ఆమె తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను వెం టనే పరిష్కరించాలన్నారు. అదనపు కలెక్టర్ మాధురి, జిల్లా రెవెన్యూ అధికారి పద్మజారాణి, డీపీవో సాయిబాబా, డీఆర్‌డీవో పీడీ జ్యోతి, సంగారెడ్డి ఆర్డీవో వసంతకుమారి, అధికారులు పాల్గొన్నారు.

8న 'మల్లన్న' ఆలయంలో టెండర్లు

ఆలయ ఈవో బాలా జీ

చేర్యాల, జూలై 1 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో ఈ నెల 8న సీల్డ్ టెండరు కమ్ బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఏ.బాలా జీ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మల్లన్న ఆలయంతో పాటు ఎల్లమ్మ దేవాలయం వద్ద కొబ్బరి ము క్కలు ప్రోగు చేసుకునే లైసెన్స్ హక్కులకు, మొక్కుబడి వస్త్రాలు ప్రోగు చేసుకునే హక్కులకు, ఒడి బియ్యం మొక్కుబడి, పసుపు ప్రోగు చేసుకునే లైసెన్స్ హక్కులకు టెండర్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటితో పాటు ఆలయానికి ఎక్కువగా ఆదా యం వచ్చే తల నీలాలు ప్రోగు చేసుకునే లైసెన్స్ హక్కులతో పాటు పాదరక్షలు, లాగేజ్ భద్రపర్చుకునే లైసెన్స్ హక్కు, దేవాలయ అన్నదాన సత్రం పక్కన గల టాయిలెట్స్ బ్లాక్ నిర్వహించేందుకు టెండర్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఆసక్తిగల వ్యక్తులు, సంస్థలు సీల్డ్‌టెండర కమ్ బహిరంగ వేలం పాటల్లో పాల్గొనాలని కోరారు.ఆయనతో ఏఈవోలు గంగా శ్రీనివాస్, బుద్ధి శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్ ఉన్నారు.

సార్..వెళ్లొద్దంటూ కన్నీళ్లు పెట్టుకున్న విద్యార్థులు

సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరు ఉపాధ్యాయులను చుట్టముట్టి కన్నీళ్లు పెట్టుకుంటున్న విద్యార్థులు

చేర్యాల, జూలై 1: మండలంలోని ఆకునూరు ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు విద్యార్థులు సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ మంచిగా చదువుకోవాలని సూచనలు చేస్తూ వెళ్లిపోయేందుకు సిద్ధమయ్యారు. ఒక్కసారిగా విద్యార్థులు ఉపాధ్యాయుల వద్దకెళ్లి సార్ మీరు పోవద్దు..మాతోనే ఉండాలి..మీరే మాకు పాఠాలు చెప్పాలంటూ కన్నీరు పెట్టుకున్నారు.123 మంది విద్యార్థులు చదువుకుంటున్న ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు తాటికొండ యాదయ్య, గొంటి బుచ్చయ్య, అక్కెనపల్లి ఇంద్రాసేనారెడ్డి, ఉప్పల భాస్కర్, కామిడి రత్నమాల పని చేస్తున్నారు. వీరిలో మెడిచెల్మి అయోధ్యకు ప్రమోషన్ రావడంతో ఇదే పాఠశాలలో హెచ్ఎంగా బాధ్యతలు స్వీకరించారు. కొన్ని సంవత్సరాలుగా ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రీడలు, పాటలు, కోలాటం తదితర కార్యక్రమాలు నేర్పించడమే కాకుండా విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారి అభ్యున్నతికి కృషి చేస్తుండడంతో విద్యార్థులకు, ఉపాధ్యాయుల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడింది. బదిలీపై వెళ్తుండడంతో జీర్ణించుకోలేని విద్యార్థులు కన్నీళ్లు పెట్టుకోవడంతో వీడ్కోలు కార్యక్రమానికి వచ్చిన సుమారు 50 మంది తల్లిదండ్రులు భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ తోళ్ల రాజేశ్వరి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అందె అశోక్ తదితరులు ఉపాధ్యాయులను సన్మానించారు.

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమివ్వాలి

ప్రజావాణిలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, జూలై1: ప్రజావాణిలో వచ్చిన సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులకు సూచించారు. సిద్దిపేట కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై అర్జీలు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌వో నాగరాజమ్మ, డీఆర్డీఏ పీడీ జయదేవ్‌ఆర్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.